సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 15 । ఆగస్టు । 2024



'సీతారామ' నీళ్లు జిల్లాకు..

సీతారామ ప్రాజెక్ట్ ద్వారా జిల్లాలోని భూములకు సాగునీరు అందించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాంతారావు కోరారు. IIలో



నిను వీడి ఉండలేను..

పొలం పనులకు వెళ్లిన భర్త విగతజీవిగా ఇల్లు చేరడంతో తట్టుకోలేకపోయిన భార్య సైతం తనువు చాలించింది. IIలో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 26°

జిల్లాలో గురువారం ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి


ఒకటో పంప్‌హౌస్ సందర్శనలో కలెక్టర్ జితేష్



పంప్‌హౌస్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

అశ్వాపురం: మంత్రుల పర్యటన నేపథ్యంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. మండల పరిధిలోని బీజీ కొత్తూరులో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం మొదటి పంప్‌హౌస్‌ను కలెక్టర్, ఐటీడీఏ పీఓ రాహుల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు బుధవారం సందర్శించారు. పంప్‌హౌస్‌ను గురువారం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొటోకాల్ పరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దామోదర్‌రావు, మణుగూరు, పినపాక, అశ్వాపురం తహసీల్దార్లు రాఘవరెడ్డి, సూర్యనారాయణ, స్వర్ణలత, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈలు పాల్గొన్నారు.

కిన్నెరసాని నుంచి నీటి విడుదల



రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

పాల్వంచరూరల్: ఎగువ నుంచి వరద నీరు వచ్చి కిన్నెరసాని జలాశయంలో చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, బుధవారం నీటిమట్టం 405.50 అడుగులకు పెరిగింది. దీంతో ప్రాజెక్టుకు చెందిన రెండు గేట్లను ఎత్తి ఉంచి 7 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

విధుల్లో చేరిన సీఈ శ్రీనివాసరెడ్డి

పాల్వంచరూరల్: జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి బుధవారం విధుల్లో చేరారు. ఈ నెల 3వ తేదీ నుంచి సెలవులో ఉన్న ఆయన అమెరికా వెళ్లారు. దీంతో ములుగు జిల్లా సీఈ విజయ భాస్కర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అమెరికా నుంచి తిరిగివచ్చిన శ్రీనివాసరెడ్డి విధుల్లో చేరారు.

విద్యార్థులు దేశభక్తి అలవర్చుకోవాలి



విద్యార్థులకు జాతీయ జెండాలు అందజేస్తున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

సింగరేణి(కొత్తగూడెం)/ఇల్లెందురూరల్: విద్యార్థి దశ నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని డీఈఓ వెంకటేశ్వరాచారి అన్నారు. బుధవారం ఆయన రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, ఇల్లెందు ఎంఈఓ కార్యాలయాన్ని సందర్శించారు. రామవరం పాఠశాలలో ఏర్పాటు చేసిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో విద్యార్థులకు జాతీయ జెండాలను అందజేశారు. ఇల్లెందు ఎంఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇల్లెందు, గుండాల, ఆళ్లపల్లి మండలాలకు చెందిన 2023–24 ఆర్థిక సంవత్సరపు నిధుల ఆడిట్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ప్రస్తుతం ఎంపిక చేసిన ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పన పనులు జరుగుతున్నాయని, భవిష్యత్‌లో అన్ని పాఠశాలలకు ప్రభుత్వం పనులను విస్తరిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ పూర్తయినందున అకాడమిక్ ప్రక్రియపై దృష్టిసారించాలని చెప్పారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎఫ్ఏఓ శ్రీనివాస్, ఇల్లెందు, ఆళ్లపల్లి, గుండాల ఎంఈఓ పి.కృష్ణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

భద్రాద్రికి భరోసా దక్కేనా?

సీతారామ పథకంతో జిల్లాలో ఒక్క ఎకరాకు దక్కని నీరు

- మొదలుకాని డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణ పనులు
- కాగితాల్లోనే ఇల్లెందు, భద్రాచలం ప్రతిపాదనలు
- భద్రాద్రికి ఇప్పటికే హామీ ఇచ్చిన కేబినెట్ మంత్రులు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన కోసం జిల్లా వాసుల ఎదురుచూపులు



ములకలపల్లి మండలం పూసుగూడెం సమీపంలోని సీతారామ పంపుహౌస్-2

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: సీతారామ ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లాలోని సాగు భూములకు గోదావరి జలాలు త్వరగా అందేలా సీఎం రేవంత్‌రెడ్డి నుంచి ప్రకటన వస్తుందని ఇక్కడి ప్రజలు ఆశిస్తున్నారు. ఇప్పటికే గిరిజన జిల్లాగా ఉన్న భద్రాద్రికి అన్యాయం జరుగుతోందనేవాదనలు రోజురోజుకు బలపడుతున్నాయి.

పేరుకే రెండు లక్షలు

సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందిస్తామని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఇందులో 1.75 లక్షల ఎకరాలు కొత్త ఆయకట్టు కాగా 42 వేల ఎకరాలు స్థిరీకరణ ఆయకట్టు ఉంది. ప్రస్తుత ప్రారంభోత్సవం వల్ల జిల్లాలో ఒక్క ఎకరాకు కూడా నీరు అందని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాలో గరిష్టంగా అశ్వారావుపేట పరిధిలో 1.39 లక్షల ఎకరాలకు నీరు అందాలి. కానీ సత్తుపల్లి ట్రంక్ కెనాల్ పనులు కాకపోవడంతో ప్రస్తుతం నీరందే పరిస్థితి లేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ లేకపోవడంతో కొత్తగూడెం పరిధిలో 40 వేల ఎకరాలు, పినపాక పరిధిలో 17 వేల ఎకరాలకు నీరు అందదు. మరోవైపు భద్రాచలం, ఇల్లెందులకు సీతారామ ద్వారా దక్కేది గుండు సున్నాగా ఉంది. ఈ నేపథ్యంలో సీతారామ ప్రాజెక్టు ఫలాలు భద్రాద్రి జిల్లాకు త్వరితగతిన అందేలా డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులతో పాటు ఇల్లెందు, మార్లెళ్లపాడు, ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన రూ.4,500 కోట్ల నిధుల మంజూరుపై సీఎం నుంచి కీలక ప్రకటన కోసం ఎదురు చూస్తున్నారు.

ఇల్లెందు డీపీఆర్ ఇలా

ప్రధాన కాలువకు సంబంధించి జూలూరుపాడు దగ్గర 1.8 కి.మీ టన్నెల్ నిర్మాణంతో పాటు అటవీశాఖ అనుమతుల కారణంగా 18 కి.మీ వరకు కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఈ పనులు త్వరితగతిన చేపడితే ఇటు పాలేరు జలాశయానికి గోదావరి నీరు అందివ్వడంతో పాటు సీతారామలో ఇల్లెందుకు చోటు కల్పించేందుకు వీలవుతుంది. జూలూరుపాడు కెనాల్ అయిన తర్వాత ఎత్తిపోతల ద్వారా ఇల్లెందు సమీపంలోని లలితాపురం చెరువుకు, అక్కడి నుంచి బయ్యారం చెరువుకు నీటిని ఎత్తిపోస్తారు. తద్వారా ఇల్లెందు నియోజకవర్గంలో లక్ష ఎకరాల మేరకు కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. ఈ మేరకు రూ.3,220 కోట్లతో డీపీఆర్ రూపొందించారు. దీనికి ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే జూలూరుపాడు టన్నెల్/కెనాల్ పనులకు సమాంతరంగా ఇల్లెందులో పంప్‌హౌస్‌లు, డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు చేసుకునే వీలు కలుగుతుంది.

డిస్ట్రిబ్యూటరీకి రూ.1,050 కోట్లు

- మొదటి పంప్‌హౌస్ కంటే ముందే ప్రధాన కాలువ వెంబడి 9.8 కి.మీ దగ్గర మార్లెళ్లపాడు ఎత్తిపోతల ద్వారా గోదావరి నీటిని తుమ్మల చెరువుకు తరలిస్తే తద్వారా 15,795 ఎకరాలకు నీరు అందించే వీలుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.115 కోట్లు కాగా 252 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది.
- ప్రధాన కాలువ వెంబడి 74 కి.మీ దగ్గర డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మిస్తే 38,000 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. దీని కోసం 1,658 ఎకరాల భూసేకరణకు రూ. 165 కోట్లు నిర్మాణ పనులకు రూ. 497 కోట్లు అవసరం అవుతుంది.
- ప్రధాన కాలువ వెంబడి 74 కి.మీ నుంచి 98 కి.మీల మధ్యన డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మిస్తే 34 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. ఈ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ నిర్మాణ పనులకు రూ.251 కోట్లు, భూసేకరణకు 136 కోట్లు అవసరం. ఈ కాలువ నిర్మాణానికి 1,336 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. మొత్తంగా ప్రస్తుతం అందుబాటులో వచ్చిన ప్రధాన కాలువ వెంబడి మూడు డిస్ట్రిబ్యూటరీ కెనాల్స్ నిర్మిస్తే 72 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. దీనికి 3,021 ఎకరాల భూసేకరణ రూ.1,050 కోట్లు ఖర్చు అవుతుంది.

ప్రగళ్లపల్లి ఎత్తిపోతలు

ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా భద్రాచలం నియోజకవర్గంలో 35 వేల ఎకరాల కొత్త ఆయకట్టు అందుబాటులోకి వస్తుంది. ఈ ప్రాజెక్టు అంచనా నిర్మాణ వ్యయం రూ.350 కోట్లుగా ఉంది. దీంతోపాటు తాలిపేరు, పెద్దవాగు, మొండికుంట వాగులపై ఎత్తిపోతలు ప్రతిపాదించాల్సిన అవసరం ఉంది.

ఎత్తిపోతలు ఇలా

దుమ్ముగూడెం ఆనకట్ట దగ్గర గోదావరి నదీ ప్రవాహం 63 మీటర్ల ఎత్తులో ఉంది. అక్కడి నుంచి 43 అడుగుల ఎత్తు ఉన్న బీజీ కొత్తూరు పంప్‌హౌస్‌కు గ్రావిటీ కెనాల్ ద్వారా నీరు చేరుకుంటుంది. ఇక్కడ నీటిని మోటార్ల ద్వారా 67.15 మీటర్లకు ఎత్తిపోస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా 62.20 మీటర్ల ఎత్తులో ఉన్న ములకలపల్లి మండలం పూసుగూడెం దగ్గరున్న పంప్‌హౌస్-2కి నీరు చేరుకుంటుంది. ఇక్కడ మోటార్లతో 110 మీటర్లకు ఎత్తిపోస్తారు. 107 మీటర్ల ఎత్తులో కమలాపురంలో ఉన్న పంప్‌హౌస్-3కి చేరుకుంటాయి. ఎత్తిపోసిన నీరు ప్రధాన కాలువలో సగటున గంటకు మూడు కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి.

పంప్‌హౌస్‌లు, నీటి ఎత్తిపోతల వివరాలు

పంప్‌హౌస్-1	పంప్‌హౌస్-2	పంప్‌హౌస్-3
(బీజీ కొత్తూరు)	(పూసుగూడెం)	(కమలాపురం)
43 నుంచి 67 మీటర్లకు	62 నుంచి 110 మీ.	107 నుంచి 160 మీ.

'సీతారామ' 35 శాతమే పూర్తి

మంత్రి తుమ్మల

సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు 35 శాతం పనులే పూర్తయ్యాయని మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. మూడో పంప్‌హౌస్ ట్రయల్ రన్ అనంతరం ఆయన మాట్లాడారు. సీతారామ పనులు పూర్తి చేసే లక్ష్యంతో ఇప్పటికే ఇరిగేషన్ మంత్రిని ఇక్కడికి తీసుకువచ్చి ప్రాజెక్టు స్వరూప స్వభావాలను వివరించామని, ఇప్పుడు ముఖ్యమంత్రి వస్తున్నందున ఆయనకు ప్రాజెక్టు గురించి పూర్తి వివరాలు అందచేస్తామని వివరించారు. అవసరమైన నిధులు సమీకరించి, ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రెండు జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులం కలిసి పని చేస్తామన్నారు. గోదావరి జలాలు బీడు భూములకు అందుతుండటంతో తన గుండె ఉప్పొంగిపోతుందన్నారు.

విద్యాసంస్థలపై ఒత్తిడి

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా జనాలు, కార్యకర్తలను తరలించేందుకు వాహనాలు సమకూర్చాలంటూ పై నుంచి వచ్చిన ఒత్తిళ్లతో జిల్లా అధికారులు బుధవారం సాయంత్రం హైరానా పడ్డారు. మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ బస్సులు కిక్కిరిసి పోతున్నాయి. సీఎం సభకు ఆర్టీసీ బస్సులు పెద్ద మొత్తంలో వినియోగిస్తే దాని ప్రభావం మహిళా ప్రయాణికులపై పడుతుందనే సందేహంతో ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టారు. అందులో భాగంగా ముఖ్యమంత్రి పర్యటనకు జన సమీకరణ చేసేందుకు వీలుగా ప్రైవేటు స్కూలు బస్సులు, సెవన్ సీటర్ వెహికల్స్ సమకూర్చాలంటూ జిల్లా అధికారులపై ఒత్తిడి చేశారు. అయితే ఆగస్టు 15 స్వాతంత్య్ర దినోత్సవం కావడంతో అనేక స్కూళ్ల యాజమాన్యాలు బస్సులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. అయితే బుధవారం రాత్రి గడుస్తున్న కొద్దీ వారిపై ఒత్తిడి తీవ్రత పెరిగింది. ప్రైవేటు టూర్ ఆపరేటర్ల పరిస్థితి ఇంచుమించు ఇలాగే తయారైంది.

పంప్‌హౌస్-3 ట్రయల్‌రన్ విజయవంతం

పరిశీలించిన మంత్రి తుమ్మల

ములకలపల్లి: సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్-3 ట్రయల్‌రన్ విజయవంతమైంది. మండల పరిధిలోని కమలాపురం శివారులో ఉన్న పంప్‌హౌస్-3లో మొత్తం ఏడు మోటార్లు ఉండగా, బుధవారం ఒక మోటార్ ఆన్ చేశారు. నీటిపారుదల శాఖ ముఖ్య సలహాదారు పెంటారెడ్డి, ఈఈ శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో ట్రయల్‌రన్ దిగ్విజయంగా పూర్తి చేశారు. కాగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి పంప్‌హౌస్‌ను సందర్శించి, ట్రయల్ రన్‌ను పరిశీలించారు. డిశ్చార్జి కెనాల్ వద్ద నీటి పరవళ్లను చూసి, ఎగసిన తుంపర్లతో తడిసిపోవడంతో హర్షం వ్యక్తం చేశారు.



గోదావరి నీటి తుంపర్లలో తడుస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


గోదావరిని కృష్ణనదిలో కలిపే కల నెరవేరుతుండటంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, నాయకులు తాండ్ర ప్రభాకర్‌రావు, బత్తుల అంజి, నాగళ్ల వెంకటేశ్వరరావు, అడపా నాగేశ్వరావు, బాల అప్పారావు, గాడి తిరుపతిరెడ్డి, తన్నీరు నాగయ్య, ఆలపాటి ప్రసాద్, దొడ్డా ప్రసాద్ పాల్గొన్నారు.

ములకలపల్లికి ముఖ్యమంత్రి తొలిసారిగా..

ములకలపల్లి: ములకలపల్లి మండలంలో నేటివరకు ఏ ముఖ్యమంత్రీ అడుగుపెట్టలేదు. అశ్వారావుపేట తాలూకాలో ఉన్న ములకలపల్లి ఆ తర్వాత మండలకేంద్రంగా మారింది. అయినా ముఖ్యమంత్రి హోదాలో ఒక్కరూ ఇక్కడకు వచ్చిందిలేదు. ఈతరుణంలో సీఎంగా రేవంత్‌రెడ్డి ములకలపల్లి మండలపరిధిలోని పూసుగూడెం సీతారామ పంప్‌హౌస్-2కు విచ్చేస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మధ్యతరహా నీటిపారుదల జలాశయం మూకమామిడి ప్రాజెక్ట్ శంకుస్థాపనకు 1978లో నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రాగా, 1980లో సీఎం మర్రి చెన్నారెడ్డి ప్రాజెక్ట్‌ను ప్రారంభించారు. అయితే అప్పటికీ ములకలపల్లి అశ్వారావుపేట తాలూకాలోనే కొనసాగుతోంది. మండలం ఏర్పడ్డాక ఇన్నేళ్లకు సీఎం ములకలపల్లిలో అడుగు పెడుతుండటం గమనార్హం.

సీఎం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

600 మంది పోలీసులతో బందోబస్తు



గుడారం ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ములకలపల్లి: పూర్తి ఏజెన్సీ మండలమైన ములకలపల్లిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు అధికారులు విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. పూసుగూడెం శివారు సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్-2ను సీఎం ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పంప్‌హౌస్-2 వద్ద పైలాన్ నిర్మాణం పూర్తి కావొచ్చింది. చెత్తాచెదారం తొలగించి, ప్రాంతాన్ని పరిశుభ్రం చేశారు. సీఎం మధ్యాహ్న భోజనం చేయనుండగా, ప్రత్యేకంగా గుడారాలు నిర్మిస్తున్నారు. పైలాన్ ఆవిష్కరణ తర్వాత డిశ్చార్జి కెనాల్ వద్దకు సీఎం వచ్చి, గోదావరి నీళ్లకు పూజలు చేయనున్న క్రమంలో పలుమార్లు పోలీస్ వాహనాలతో ట్రయల్ వేశారు. సీఎంతోపాటు మంత్రులు కూడా రానుండగా, రెండు హెలీప్యాడ్లను సిద్ధం చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం పూసుగూడెం పంప్‌హౌస్-2, కమలాపురం పంప్‌హౌస్-3ను ఎమ్మెల్యే జారె ఆదినారాయణతో కలిసి సందర్శించారు. డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పంప్‌హౌస్‌ను సందర్శించారు.

భారీ బందోబస్తు..

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతం కావడం, మావోల ప్రభావం ఉన్న జిల్లా నేపథ్యంలో ఎస్పీ రోహిత్‌రాజు నేతృత్వంలో పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. మొత్తం 600 మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. వీరిలో నలుగురు డీఎస్పీలు, 17 మంది సీఐలు, 40 మంది ఎస్సైలు ఉన్నారు.

అంతా సిద్ధం..

నేడు ఉమ్మడి జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి

- భద్రాద్రి జిల్లాలో 'సీతారామ' మోటార్ల స్విచ్ఛాన్
- వైరా రైతుసభలో ప్రసంగం, రుణమాఫీ చెక్కుల పంపిణీ
- వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యాన స్టాళ్ల ఏర్పాటు



ములకలపల్లి మండలం పూసుగూడెం పంపుహౌస్ వద్ద సిద్ధం చేస్తున్న పైలాన్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సీఎం తొలుత భద్రాద్రి జిల్లా ములకలపల్లి మండలం పూసుగూడెంలోని సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్ మోటార్లను స్విచ్ఛాన్ చేస్తారు. అనంతరం వైరాలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొననుండగా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తిచేసింది. ఇక వైరాలో సభాస్థలి వద్ద ఏర్పాటుచేయనున్న వ్యవసాయ, అనుబంధ శాఖల స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

15 ఎకరాల్లో సభాస్థలి

వైరాలోని శాంతినగర్ సమీపాన 15 ఎకరాల్లో సభా ప్రాంగణమంతా రైతు కళ ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. ఓవైపు రైతులను ఆకర్షించేలా స్టాళ్లు, మరోవైపు సీఎం ప్రసంగాన్ని వీక్షించేలా భారీ స్క్రీన్లు ఏర్పాటుచేశారు. రూ.1.50 లక్షల నుంచి రూ.2లక్షల లోపు రుణమాఫీ చెక్కులను ఇదే వేదికపై అందజేయనుండడంతో భారీగా రైతులను తరలించడంపై కాంగ్రెస్ నేతలు దృష్టి సారించారు. ములకలపల్లి మండలం పూసుగూడెంలో సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌ను ప్రారంభించాక సీఎం నేరుగా వైరా చేరుకుని గంటన్నర పాటు ఇక్కడే ఉంటారు. సీఎంతోపాటు డిప్యూటీ సీఎం విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సహా ఇంకొందరు మంత్రులు ఈ సభలో ప్రసంగించనున్నారు. కాగా, వ్యవసాయంతో అనుబంధ శాఖల ఆధ్వర్యాన 32 స్టాళ్లు ఏర్పాటుచేస్తుండగా ఆయా శాఖల ద్వారా రైతులకు అందిస్తున్న పథకాలను వివరించనున్నారు.

జన సమీకరణపై దృష్టి

ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి రెండోసారి ఉమ్మడి జిల్లా పర్యటనకు వస్తున్నారు. తొలిసారి భద్రాచలంలో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ తర్వాత ఇప్పుడు ములకలపల్లి, వైరా వస్తుండడం.. వైరా వేదికపై రూ.2లక్షల రుణమాఫీ అమలు కానుండడంతో భారీ జన సమీకరణపై కాంగ్రెస్ నాయకులు దృష్టి సారించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో సభను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. వైరా నియోజకవర్గంతోపాటు సత్తుపల్లి, మధిర, ఖమ్మం, పాలేరు, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి రైతులను సభకు తరలించేలా ఏర్పాట్లుచేశారు.

త్వరలో జేకే ఓసీ విస్తరణ..

- వైద్యులు అంకితభావంతో పనిచేయాలి
- సింగరేణి సీఎండీ బలరాం



వ్యూ పాయింట్ నుంచి జేకే ఓసీని పరిశీలిస్తున్న సీఎండీ బలరాం, అధికారులు

ఇల్లెందు: త్వరలో జేకే ఓసీ విస్తరణ పనులు ప్రారంభమవుతాయని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం తెలిపారు. బుధవారం ఇల్లెందు ఏరియాలో ఆయన పర్యటించారు. తొలుత జీఎం కార్యాలయంలో తనిఖీ చేశారు. వివిధ విభాగాల అధికారులతో ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్ష నిర్వహించారు. జేకే ఓసీ ప్రాజెక్టు విస్తరణకు అనుమతులు వేగంగా సాధిస్తున్నామని తెలిపారు. అనంతరం సింగరేణి ఆస్పత్రిని సందర్శించారు. జనరల్ వార్డు, స్టోర్స్, ల్యాబ్‌లను తనిఖీ చేశారు. అంకితభావంతో పని చేయాలని వైద్యులకు సూచించారు. ఆ తర్వాత ఇల్లెందు ఏరియాలో నూతనంగా నిర్మించనున్న పంప్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ స్థలాన్ని సీఎండీ పరిశీలించారు. వ్యూ పాయింట్ నుంచి జేకే-5 ఓసీలో ఉత్పత్తిని పరిశీలించారు. జేకే-5 ఓసీ డంప్ యార్డుపై మొక్కను నాటారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సూచించారు. జేకే ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. కాసేపు టీచర్‌గా మారి బోధించారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సింగరేణి వ్యాప్తంగా సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్(ఈఅండ్‌ఎం) డి.సత్యనారాయణ, జీఎంలు ఎస్‌డీ ఎం సుభానీ, జానకీరాం, కేవీ రావు, సీఎంఓ సుజాత, జాన్‌ఆనంద్, ఇతర అధికారులు బి. వెంకటేశ్వర్లు, జీవీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జమలాపురంలో పవిత్రోత్సవాలు ప్రారంభం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా యాగశాలలో పూజలు చేసిన అర్చకులు.. ఆ తర్వాత శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం కలశస్థాపన, హోమం నిర్వహించగా భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఆలయ ఈఓ కె.జగన్‌మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

కేయూ దూరవిద్యలో ప్రవేశాలు

ఖమ్మం సహకారనగర్: కాకతీయ యూనివర్సిటీ పరిధి సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డీఎల్‌సీఈ)లో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. బీఏ, బీకాం జనరల్, కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ గణితం, బీఎల్ఐసీతో పాటు పీజీలో ప్రవేశాలకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని ఖమ్మంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి తెలిపారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా 98492 50633లో సంప్రదించాలని సూచించారు.

‘సీతారామ’ నీళ్లు జిల్లాకు అందించాలి

బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, నాయకులు

మణుగూరురూరల్‌: పినపాక నియోజకవర్గంలో సీతారామ ప్రాజెక్ట్‌ మిగులు పనులను పూర్తి చేసి, జిల్లా రైతాంగానికి సాగునీరు అందించాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్‌ చేశారు. సీతారామ జలాలను జిల్లా ప్రజలకు అందించాలని కోరుతూ బుధవారం మణుగూరు తహసీల్‌ ఎదుట ధర్నా చేశారు. తొలుత పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 90శాతానికి పైగా పనులను పూర్తి స్తే, ప్రస్తుత కాంగ్రెస్‌ ప్రభుత్వం మిగులు పనులను పూర్తి చేయించలేకపోయిందని విమర్శించారు. ప్రభుత్వంపై నమ్మకం లేని కాంట్రాక్టర్లు పనులను వదిలిపెట్టి వెళ్లిపోయారన్నారు. జిల్లాలోని నియోజకవర్గాలకు సాగునీటి ఇవ్వకుండా పక్క ప్రాంతాలకు నీరు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు సాగునీటి విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పట్ల వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ పోశం నర్సింహరావు, నాయకులు ముత్యంబాబు, అడపా అప్పారావు, వట్టం రాంబాబు, బొలిశెట్టి నవీన్‌, కుర్రి నాగేశ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

‘సీతారామ’ రీడిజైన్‌తో తీరని అన్యాయం

టేకులపల్లి: సీతారామ ప్రాజెక్ట్‌ రీడిజైన్‌తో ఇల్లెందు ప్రాంతానికి తీరని అన్యాయం జరుగుతోందని మాజీ ఎమ్మెల్యే బానోత్‌ హరిప్రియ అన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు ఇల్లెందు నియోజకవర్గానికి అందించాలని కోరుతూ బుధవారం బీఆర్‌ఎస్‌ ఆధ్వర్యంలో టేకులపల్లిలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌ కార్యాలయానికి చేరుకుని డీటీ ముత్తయ్యకు వినతిపత్రం అందజేశాక హరిప్రియ మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు ఇల్లెందు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసేందుకు 2016 ఫిబ్రవరి 16న మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేగా కోరం కనకయ్య ఆధ్వర్యంలో రోళ్లపాడు వద్ద సీఎం కేసీఆర్‌ సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని, అప్పుడే రీడిజైన్‌ చేసి ఇల్లెందు ప్రాంతానికి చుక్క నీరు రాకుండా తీరని అన్యాయం చేశారని విమర్శించారు. 2018లో తాను ఎమ్మెల్యేగా గెలిచాక ఇల్లెందుకు జరిగిన అన్యాయాన్ని కేసీఆర్‌కు వివరించి, రూ.3,220 కోట్లతో రోళ్లపాడు కేంద్రంగా ఇల్లెందు నియోజకవర్గంతో పాటు టేకులపల్లి మండలం మొత్తం పచ్చగా మార్చేలా డీపీఆర్‌ అడ్మినిస్ట్రేషన్‌ మంజూరు చేయించానని తెలిపారు. నిధులు కేటాయించి, మంజూరైన ప్రాజెక్టుని ఇల్లెందుకు తెప్పించడంలో ప్రస్తుత ఎమ్మెల్యే విఫలమయ్యారని ఆరోపించారు. ఇల్లెందు నుంచి పాలేరు, డోర్నకల్‌, మానుకోట ప్రాంతాలకు నీరందిస్తున్నారు కానీ, ఇల్లెందుని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఇల్లెందు ప్రాంత రైతాంగానికి ప్రస్తుత ఎమ్మెల్యే చేసిందేమిటని, ఆయన ఉన్నా లేనట్లేనని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకుని ముగ్గురు మంత్రులతో మాట్లాడి ఇల్లెందు ప్రాంతానికి సీతారామ జలాలు తరలించాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో లక్కినేని సురేందర్‌రావు, బొమ్మెర వరప్రసాద్‌, బోడ బాలు, బాణోతు రామ, సిలివేరు సత్యనారాయణ, భూక్య లాలు, బర్మావత్‌ శివకృష్ణ, రాజు, తేజావత్‌ రవి, లచ్చు, కుమ్మరి కిరణ్‌, మల్లయ్య, కిషన్‌, బాలు, అప్పారావు, నగేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

40 మంది విద్యార్థులు.. ఒక్కరే టీచర్‌



ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

పాల్వంచరూరల్‌: నలభై మంది విద్యార్థులు ఉంటే టీచర్‌ మాత్రం ఒక్కరే ఉండటంతో ఇబ్బందికరంగా మారిందని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని విద్యార్థులతో కలిసి తల్లిదండ్రులు పాఠశాల వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని రంగాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉండగా 40 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల ప్రారంభంలో ఇద్దరు టీచర్లు ఉండగా వారు బదిలీ, పదోన్నతిపై వెళ్లారు. ప్రస్తుతం మరో స్కూల్‌ నుంచి ఒక్క టీచర్‌ మాత్రమే వచ్చి బోధిస్తున్నారు. ఒక్కరే ఐదు తరగతులకు బోధించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మరో ఇద్దరు టీచర్లను నియమించాలని డిమాండ్‌ చేస్తూ విద్యా కమిటీ చైర్మన్‌ బానోత్‌ నాగేశ్వరి, సేవాలాల్‌ సేన మండల అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌నాయక్‌, విద్యార్థులు, తల్లిదండ్రులతో స్కూల్‌ ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా, ఈ విషయంపై ఎంఈఓ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా ఖాళీ పోస్టుల భర్తీకి ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే టీచర్లను నియమిస్తామని తెలిపారు.

నిను వీడి నేను ఉండలేను..

- పొలానికి వెళ్లిన భర్త గుండెపోటుతో మృతి
- విగతజీవిగా రావడంతో తట్టుకోలేక భార్య హఠాన్మరణం



సోమయ్య - శంకరమ్మ దంపతులు (ఫైల్‌)

మణుగూరు టౌన్‌: పొలం పనులకు వెళ్లిన వ్యక్తి భోజనానికి వస్తాడని ఎదురుచూస్తుండగా విగతజీవిగా ఇల్లు చేరడంతో తట్టుకోలేకపోయిన భార్య సైతం తనువు చాలించింది. ఈ విషాద ఘటన మణుగూరులో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటన వివరాలు... మణుగూరు మున్సిపాలిటీ పరిధి బాలాజీనగర్‌లో కొమ్ము సోమయ్య(72) - శంకరమ్మ(65) దంపతులు నివాసమంటున్నారు. సింగరేణి రిటైర్డ్‌ కార్మికుడైన సోమయ్య ముగ్గురు కుమారులు ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డారు. బాలాజీ నగర్‌లో పదేళ్లుగా నివాసముంటున్న సోమయ్య రోజు మాదిరిగానే బుధవారం ఉదయం పొలానికి వెళ్లాడు. చాకలి ఐలమ్మ నగర్‌లోని తన ఐదెకరాల పొలంలో పని చేస్తుండగా గుండెపోటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. కాసేపటికి గుర్తించిన సహచర రైతులు సోమయ్య మృతదేహాన్ని నివాసానికి తీసుకురాగా.. అప్పటికే ఆయన భోజనానికి వస్తాడని శంకరమ్మ ఎదురుచూస్తోంది. ఇంతలోనే భర్త మృతదేహం చేరుకోగా తట్టుకోలేకపోయిన ఆమె సొమ్మసిల్లి పడిపోయింది. దీంతో కుటుంబీకులు ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు గుండెపోటుతో మృతి చెందిందని తెలిపారు. అందరితో కలివిడిగా ఉండే దంపతులు గంటల వ్యవధిలో మృతి చెందడంతో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సందర్శించి సంతాపం తెలిపారు.

గుండెపుడిలో గొర్రెలు చోరీ

జూలూరుపాడు: మండలంలోని గుండెపుడి గ్రామానికి చెందిన మద్దెబోయిన పిచ్చారావుకు చెందిన గొర్రెల (మూగజీవాలు)ను మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం.. పిచ్చారావు ఇంటి ప్రాంగణంలోకి మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి గొర్రెలను వాహనంలో ఎక్కిస్తుండగా అవి అరిచాయి. పిచ్చారావు లేచి పెద్దగా కేకలు వేయడంతో అప్పటికే వాహనంలో ఎక్కించిన 8 గొర్రెలతో వారు పారిపోయారు. కొంతదూరం వెంబడించినప్పటికీ టాటా మ్యాజిక్‌ వాహనం దొరకలేదని పిచ్చారావు తెలిపారు. వాటి విలువ రూ.1.50 లక్షల వరకు ఉంటుందని బాధితుడు వాపోయాడు. స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పాడు.

ఉత్తమ సింగరేణియన్లు వీరే..

- నేడు కొత్తగూడెంలో సీఎండీ చేతుల మీదుగా సన్మానం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలోని వివిధ విభాగాల్లో ఉత్తమ ఉద్యోగుల (ఉత్తమ సింగరేణియన్లు)ను ఎంపిక చేశారు. సంస్థ వ్యాప్తంగా 12 మందిని గుర్తించగా వారికి కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో గురువారం జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో సీఎండీ బలరామ్‌ ప్రశంసాపత్రాలు అందజేసి సన్మానిస్తారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిలో షేక్‌ మైబాషా(ఎలక్ట్రీషియన్‌, వర్క్‌షాపు మణుగూరు ఏరియా), కొంగర వెంకటేశ్వర్లు (ఫిట్టర్‌, కేటీసీ, ఇల్లెందు ఏరియా), ఐనవెల్లి శ్రీనివాసరావు (ఫిట్టర్‌, కిష్టారం ఓసీ, కొత్తగూడెం ఏరియా), బొబ్బల మల్లారెడ్డి(ఈపీ ఆపరేటర్‌, కేటీకే ఓసీ భూపాలపల్లి ఏరియా), అబ్దుల్‌ రజాక్‌ (ఈపీ ఆపరేటర్‌, ఓసీపీ, ఆర్జీ–3 ఏరియా), బానోత్‌ కార్మిక్‌ (ఫోర్మెన్‌ ఆటో/మెకానిక్‌, అండ్రియాల ప్రాజెక్ట్‌), సల్లా భిక్షపతి (ఈపీ ఆపరేటర్‌, జీడీకే ఓసీపీ–3, ఆర్జీ–2 ఏరియా), ఉబుతా బుచ్చయ్య (రాంకర్‌/ షటిల్‌ కార్‌ ఆపరేటర్‌ జీడీకే–11, ఆర్జీ–1), ఎంజారపు విజయ్‌కుమార్‌ (ఈపీ ఫిట్టర్‌, ఖైరీగుడ ఓసీపీ, బెల్లంపల్లి ఏరియా), పొట్టా రాజలింగయ్య (హెడ్‌ ఓవర్‌మెన్‌, శాంతిఖని, మందమర్రి ఏరియా), కర్రె బీరయ్య (ఎస్‌డీఎల్‌ ఆపరేటర్‌ ఆర్కే 6 ఇంక్లైన్‌, శ్రీరాంపూర్‌ ఏరియా)తో పాటు మహమ్మద్‌ నిసారుద్దీన్‌ (సీనియర్‌ అసిస్టెంట్‌, ఎస్టీపీపీ) ఉన్నారని జీఎం పర్సనల్‌ (వెల్ఫేర్‌ అండ్‌ ఆర్సీ) శామ్యూల్‌ సుధాకర్‌ వెల్లడించారు.

వైద్యుల నియామకానికి నేటి నుంచి ఇంటర్వ్యూలు

భద్రాచలంఅర్బన్‌: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో కాంట్రాక్ట్‌ పద్ధతిపై వైద్యుల నియామకానికి గురువారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రామకృష్ణ తెలిపారు. గైనకాలజిస్ట్‌, అనస్తీషియన్‌ ఒక్కొక్కరితో పాటు ఇద్దరు పీడియాట్రీషియన్ల నియామకానికి ఆసక్తి ఉన్న వారు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఇంటర్వ్యూలకు అర్హతలు, సీనియారిటీ ఒరిజినల్‌ సర్టిఫికెట్లు, ఒక సెట్‌ జిరాక్స్‌తో హాజరుకావొచ్చని వెల్లడించారు. ప్రత్యక్షంగా ఇంటర్వ్యూకు హాజరుకాలేని వారు msahbcm@gmail.com మెయిల్‌ ద్వారా సంప్రదించాలని సూచించారు. నెలనెలా గైనకాలజిస్ట్‌కు రూ.2 లక్షలు, పీడియాట్రీషియన్‌, అనస్తీషియన్‌కు రూ.1.50 లక్షల చొప్పున వేతనం అందుతుందని తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్‌: నలుగురిపై దాడి చేసి ఇంట్లో వస్తువులను ధ్వంసం చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని నాగారంకాలనీకి చెందిన తేజావత్‌ సుమన్‌.. అదే గ్రామానికి చెందిన బానోతు శైలజ, ఆమె భర్త రాము, అత్త మంగినీ, మామ కాంతుపై మంగళవారం దాడి చేశాడు. ఇంట్లోని టీవీ, ఇతర వస్తువులను ధ్వంసం చేశాడు. దీంతో శైలజ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్‌ తెలిపారు.

ఆటో, ద్విచక్ర వాహనం ఢీ

కరకగూడెం: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. భట్టుపల్లి గ్రామానికి షేక్‌ ఖదిర్‌ తన ద్విచక్ర వాహనంపై కరకగూడెం వెళ్లి వస్తుండగా అదే గ్రామానికి చెందిన శివరాత్రి మధు తన ఆటోలో తన కుమారుడితో కలిసి వెళ్తున్నాడు. భట్టుపల్లి సమీపానికి చేరుకోగానే ఆగి ఉన్న డీసీఎం వాహనంను తప్పిస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న ఖదిర్‌ ద్విచక్ర వాహనం, ఆటో ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఆటో నుజ్జునుజ్జు కాగా అందులో ఉన్న మధు కుమారుడు శివసాత్వికి స్వల్ప గాయాలవగా ఖదిర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఖదిర్‌ను 108 ద్వారా స్థానిక పీహెచ్‌సీకి, అక్కడి నుంచి భద్రాచలం ఏరియాస్పత్రికి తరలించారు.

బావిలో పడి మహిళా రైతు మృతి

కామేపల్లి: ఓ మహిళా రైతు ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. మండలంలోని పండితాపురానికి చెందిన ధర్మసోత్‌ కిషన్‌ –నాగమణి(45) దంపతులు బుధవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. మధ్యాహ్నం నాగమణికి దాహం వేయడంతో బావి వద్దకు వెళ్లే క్రమాన జారి బావిలో పడగా మృతి చెందింది. ఆమెకు భర్తతో పాటు ముగ్గురు పిల్లలు ఉండగా తండ్రి లాల్యా ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన సర్జరీ



ఆపరేషన్‌ చేసిన డాక్టర్‌ శైలేశ్‌ బృందం

పాల్వంచ: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాలి శస్త్రచికిత్సను విజయవంతంగా చేశారు. పాల్వంచకు చెందిన నర్సిరెడ్డి (51) నెల రోజుల నుంచి మోకాలికి చీము పట్టి తీవ్ర నొప్పితో బాధపడుతున్నాడు. పరీక్షించిన ఆస్పత్రి ఆర్థోపెడిక్‌ వైద్యులు శైలేశ్‌ ఆపరేషన్‌ అవసరం అని సూచించారు. అనంతరం వైద్య పరీక్షలు చేసి బుధవారం మోకాలికి శస్త్ర చికిత్స విజయవంతంగా చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాంప్రసాద్‌, ఆర్‌ఎంఓ డాక్టర్‌ సోమరాజు దొర, సిబ్బంది డాక్టర్‌ శైలేశ్‌ను అభినందించారు.


జీసీసీ వద్ద ఆగని వివాదం

పాల్వంచరూరల్‌: స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) బ్రాంచ్‌ స్థలం వద్ద వివాదం రాజుకుంటోంది. జీసీసీకి చెందిన స్థలంలో హమాలీకాలనీకి చెందిన కొందరు దేవుడి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేసి బుధవారం పూజలు చేశారు. కొద్ది రోజుల కిందట ఆక్రమించిన స్థలంలో నిర్మాణాలను తొలగించారు. అప్పటి నుంచి జీసీసీ అధికారులకు.. హమాలీకాలనీవాసులకు మధ్య వివాదం జరుగుతోందని, స్థలంలో దేవుడి విగ్రహాలను ప్రతిష్ఠించొద్దని అనేకసార్లు చెప్పినా వినిపించుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని మేనేజర్‌ లక్ష్మోజి తెలిపారు.

రాజకీయ నేత దౌర్జన్యం చేశాడని ఫిర్యాదు

ఖమ్మంక్రైం: సొంత స్థలాన్ని శుభ్రం చేసుకుంటుండగా ఓ వామపక్ష పార్టీ నేతతో పాటు మరొకరు వచ్చి దౌర్జన్యం చేశారంటూ ఖమ్మం టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఖమ్మం వేణుగోపాల్‌నగర్‌కు చెందిన కొమ్మిశెట్టి కోటయ్య బుధవారం తన స్థలాన్ని శుభ్రం చేస్తుండగా భాగం హేమంతరావు, తాళ్లూరి మధు వచ్చి ఈ స్థలాన్ని మోత్కూరి గోపాల్‌రావు వద్ద కొనుగోలు చేశామంటూ కోటయ్యపై దౌర్జన్యం చేశారు. ఈవిషయమై కోటయ్య ఫిర్యాదు చేయగా, విచారణ జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
ఖమ్మం
గురువారం ॥ 15-8-2024


దుర్గావతి
విప్లవ వనిత

మూడేళ్ల కొడుకును పణంగా పెట్టి...
భగత్‌సింగ్‌ను కాపాడిన భాభీ

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌వీర్... వీరంతా ఆమెను 'దుర్గా భాభీ' అని పిలిచేవారు. సాయుధ పోరాటంతోనే బ్రిటిష్ వారిని దేశం నుంచి తరిమికొట్టగలం అని భావించిన దళంలో పిస్తోల్ పట్టిన తొలి విప్లవ వనిత దుర్గావతి దేవి. బ్రిటిష్ అధికారి సాండర్స్‌ను హత్య చేసిన భగత్‌సింగ్‌ను లాహోర్ నుంచి తప్పించేందుకు అతడి భార్య అవతారం ఎత్తిందామె. చరిత్ర పుటలలో కనుమరుగై పోయిన ఆ త్యాగమయి గురించి స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

'సైమన్ గోబ్యాక్' నిరసన కార్యక్రమం చేస్తున్న లాలా లజపతిరాయ్ మీద బ్రిటిష్ పోలీసుల లాఠీచార్జీ జరిగి ఆయన ప్రాణం పోయింది. పంజాబ్‌లో యువతకు మార్గదర్శిగా ఉన్న ఆ మహా నాయకుణ్ణి కోల్పోయినందుకు 'హిందూస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్' (హెచ్‌ఎస్‌ఆర్‌ఏ) సభ్యులకు ఆగ్రహం వచ్చింది. ఇది స్వాతంత్ర్య సమరయోధుడు భగవతి చరణ్ ఓహ్రా నడుపుతున్న గ్రూప్. చంద్రశేఖర ఆజాద్, భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ తదితరులంతా ఇందులో సభ్యులు. వీరంతా కలిసి లాఠీచార్జిని ఆర్డర్ వేసిన బ్రిటిష్ ఆఫీసర్ స్కాట్‌ను చంపాలనుకున్నారు. నిర్ణయం అమలు పరచడమే తరువాయి.


టెలివిజన్ ఎపిసోడ్‌లో భగత్‌సింగ్, దుర్గా భాభీ

స్కాట్ బదులు సాండర్స్

భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ఈ ముగ్గురు 17 డిసెంబర్ 1928న లాహోర్‌లో పోలీస్ ఆఫీసర్ స్కాట్‌ను హతమార్చడానికి సిద్ధమయ్యారు. అయితే బైక్ మీద రావాల్సిన స్కాట్ కారులో, కారులోనూ రావాల్సిన మరో అధికారి సాండర్స్ బైక్ మీద రావడంతో అయోమయం నెలకొంది. అయినా సరే ఎదురుపడిన సాండర్స్‌పై మొదట రాజ్‌గురు, ఆ తర్వాత భగత్ సింగ్ తుపాకీ పేల్చి అతణ్ణి హతమార్చారు. లాహోర్ అంతా గగ్గోలు రేగింది. వందలాది మంది పోలీసులు అన్ని దారులు... బస్టాండ్లు... రైల్వేస్టేషన్లు కమ్ముకున్నారు. లాహోర్‌లో ఉండటం భగత్‌సింగ్‌కు ఏ మాత్రం మంచిది కాదు. అతణ్ణి తప్పించేవారు ఎవరు?

ఆమె వచ్చింది

భగవతి చరణ్ ఓహ్రా సతీమణి దుర్గావతిని అందరూ దుర్గాభాభీ అని పిలిచేవారు. సాండర్స్‌ని హత్య చేశాక భగత్‌సింగ్, రాజ్‌గురు నేరుగా దుర్గావతి దగ్గరకు వచ్చారు. అప్పటికి ఆమె భర్త వేరే పని మీద కలకత్తా వెళ్లి ఉన్నాడు. జరిగింది తెలుసుకున్న దుర్గావతి వెంటనే భగత్‌సింగ్‌ను లాహోర్ దాటించడానికి సిద్ధమైంది. జుట్టు కత్తిరించుకుని హ్యాట్ పెట్టి రూపం మార్చిన భగత్‌సింగ్‌కు ఆమె భార్యగా నటిస్తూ తన మూడేళ్ల కొడుకుతో మరుసటి రోజు సాయంత్రం లాహోర్ నుంచి డెహ్రాడూన్ వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో మొదటి తరగతి ప్రయాణికురాలిగా బయల్దేరదీసింది. వందలాది నిఘా కళ్ల మీద ఈ పని చేయడం చాలా ప్రమాదం... మూడేళ్ల కొడుక్కు కూడా ఏదైనా కావచ్చు అని భగత్‌సింగ్ ఆమెతో అన్నాడు. 'నా కొడుక్కు మరణం సంభవిస్తే ఒక దేశభక్తునిగా తన ప్రాణం అర్పించే అవకాశం వాడికి దక్కుతుంది' అని చెప్పి ఆమె ముందుకు కదిలింది. భగత్‌సింగ్ ఆధునికవేషంలో ఉన్న అధికారిగా, దుర్గావతి అతని భార్యగా, రాజ్‌గురు నౌకరుగా ఆ ప్రయాణం చేశారు. బ్రిటిష్ వాళ్లకు ఏ మాత్రం అనుమానం రాలేదు. భగత్‌సింగ్‌ను అలా క్షేమంగా కలకత్తా చేర్చి వెనక్కు వచ్చింది దుర్గావతి.

గొప్ప దేశభక్తురాలు

స్వతంత్ర పోరాటం చేస్తున్న భగవతి చరణ్ ఓహ్రాను వివాహం చేసుకునేనాటికి దుర్గావతికి 13 ఏళ్లు. పెళ్లి తర్వాతనే చదువుకుంది. ఇంట్లో ఇరుగు పొరుగు పిల్లలకు పాఠాలు చెప్పేది. సాయుధ పోరాటం చేయాలన్న భర్త ఆశయానికి మద్దతుగా నిలిచిందామె. భగత్‌సింగ్‌ను తన కన్నబిడ్డలా భావించింది. భగత్ సింగ్ పార్లమెంట్‌లో బాంబు దాడి చేసి అరెస్ట్ అయ్యాక ఆ తర్వాతగాని అతడే సాండర్స్ హత్యలో ఉన్నాడన్న సంగతి పోలీసులకు తెలియలేదు. ఆ కేసు వాదనలను బ్రిటిష్ ప్రభుత్వం హడావిడిగా ముగించి అక్టోబర్ 7, 1930న తీర్పు వెలువరించి భగత్‌సింగ్‌కు మరణశిక్ష విధించింది. అయితే లాహోర్‌లో ఈ విచారణ జరుగుతున్నప్పుడు భగత్‌సింగ్‌ను తీసుకెళ్లే వ్యానుపై బాంబుదాడి చేసి అతణ్ణి కాపాడాలని ప్లాన్ చేసింది దుర్గావతి. వీలు కాలేదు.

భర్తను కోల్పోయి

భగత్‌సింగ్‌ను జైలు నుంచి రక్షించడానికి స్వదేశీ జ్ఞానంతో బాంబులు తయారు చేస్తూ ప్రమాదవశాత్తు భగవతి చరణ్ ఓహ్రా మరణించాడు. అంత కష్టాన్ని తట్టుకుని దేశం కోసం పోరాడాలనుకుంది దుర్గావతి. భగత్‌సింగ్ మరణశిక్ష విధించాక ఆగ్రహంతో బొంబాయి వెళ్లి బ్రిటిష్ గవర్నర్‌ను చంపాలనుకుంది. అయితే గవర్నర్ దొరకలేదు. మరో బ్రిటిష్ అధికారి మీద స్వయంగా గుళ్ల వర్షం కురిపించి పగ చల్లార్చుకుంది. భగత్ సింగ్ ఉరి (1931 మార్చి 23) తర్వాత తన వాళ్లంటూ ఎవరూ లేకపోవడం, పోలీసుల వెతుకులాట ఎక్కువ కావడంతో తనే వెళ్లి లొంగిపోయింది. మూడేళ్ల జైలు శిక్ష అనంతరం మొదట లక్నో ఆ తర్వాత ఘజియాబాద్‌లో పెద్దగా పబ్లిక్‌లో ఉండటానికి ఇష్టపడక స్కూల్ నడుపుతూ 1999లో తన 92వ ఏట మరణించిందా గొప్ప దేశభక్తురాలు, భారత తొలి సాయుధ పోరాట సమరయోధురాలు దుర్గాభాభీ.

ఇది సైనికుల సంగ్రామం

- ఇంటికొకరుగా ఆర్మీ జవాన్లు
- నాటి పీపుల్స్‌వార్ ఖిల్లా నుంచి నేడు దేశరక్షణకు సరిహద్దుల్లో యువకులు

ఒక్కో ఊరికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అలా ఈ ఊరికి ఉన్న ప్రత్యేకత 'దేశభక్తి'. దేశాన్ని కాపాడాలనే ధ్యేయంతో ఊరి యువకులు సైన్యం బాట పట్టారు. ఒకే ఊరి నుంచి ఇంటికి ఒక్కరు చొప్పున సుమారుగా 92 మందికిపైగా యువకులు సైన్యంలో తమ సేవలను అందిస్తున్నారు. ఫలితంగా ఒకప్పుడు పీపుల్స్‌వార్ ఖిల్లాగా ఉన్న ఆ ఊరిని ఇప్పుడు ఆర్మీ జవాన్ల పుట్టినిల్లుగా పిల్చుకుంటున్నారు. ఆ ఊరు సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామం. ఆ ఊరి ముచ్చట్లలోకి వెళదామా?

సుమారు 40 ఏళ్ల క్రితం కట్కూర్ గ్రామానికి చెందిన జేరిపోతుల డేనియల్ మిలిటరీలో జవాన్‌గా చేరాడు. ఆయన స్ఫూర్తితో గ్రామంలోని యువకులు సైన్యం బాటపట్టారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆర్మీలో చేరారు. జవాన్ స్థాయి నుంచి లాన్స్‌నాయక్, నాయక్, హవల్దార్, నాయక్ సుబేదార్ స్థాయి వరకు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. ఇలా గ్రామానికి చెందిన వారు ప్రస్తుతం 92 మంది ఆర్మీలో వివిధ హోదాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. దాంతో జిల్లాలో కట్కూరు గ్రామం అంటే ఆర్మీజవాన్‌ల గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 1,014 కుటుంబాలుండగా జనాభా సుమారుగా 3,045 ఉన్నారు. అందులో మొత్తం గ్రామంలో 175 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారు. వీరిలో కొందరు ఇతర ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు గ్రామంలో వ్యవసాయం చేసుకుంటున్నారు.

- మాలోతు శ్రీనివాస్, సాక్షి, అక్కన్నపేట

దేశసేవ ఇష్టం...



దేశసేవ అంటే నాకు చాలా ఇష్టం. అందుకే 1998లో భారతసైన్యంలో చేరాను. మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూప్ బెంగళూర్‌లో ట్రైనింగ్ చేశాను. కార్గిల్ యుద్ధంలో కూడా పాల్గొన్నాను. కాశ్మీర్‌లో రాష్ట్రీయ విభాగంలో సేవలు అందించి అనేక టెర్రరిస్ట్ ఆపరేషన్‌లలో పాల్గొన్నాను. కాశ్మీర్ సేవలను గుర్తించి నాకు సుబేదార్ మేజర్‌గా ప్రమోషన్ ఇచ్చారు.

- పంజా సదయ్య, సుబేదార్

గర్వపడుతున్నా...



దేశరక్షణ కోసం సైన్యంలో పని చేస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా దేశం కోసం పని చేయడం ఆనందంగా ఉంది.

- కొయ్యడ శ్రీనివాస్, ఆర్మీ జవాన్

మన(సు)లో మాట

మా బాబు ఒకచోట కుదురుగా ఉండటం లేదు...



మా బాబు వయసు 5 సంవత్సరాలు. ఒకచోట నిలకడగా ఉండకుండా, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు. ఇంట్లో, స్కూల్లో బయటా కూడా ఇలాగే చస్తుంటాడు. బయట ఫంక్షన్లకు తీసుకెళితే తనను పట్టుకోవడం, తన చుట్టూ తిరగడంతోటే సరిపోతుంది. అందువల్ల ఈ మధ్య బయటకు వెళ్లడం కూడా తగ్గించేశాం. వాళ్ల నానమ్మేమో, ఇది పిల్లల్లో మామూలే అంటుంది. ఈ మధ్య వాళ్ల స్కూల్ టీచర్ మమ్మల్ని పిలిచి, మా బాబు మీద అనేక కంప్లయింట్లు చెప్పింది. మాకు చాలా ఆందోళనగా ఉంది.

– కె. మాధవి, సికింద్రాబాద్


పిల్లల మెదడులో ఉండే సెల్ఫ్ కంట్రోల్ విభాగం లోని లోపాల వల్ల, వారసత్వ లక్షణాల రీత్యా, కొందరు పిల్లలకు మీరు చెప్పిన లక్షణాలు రావచ్చు. దీనిని హైపర్ యాక్టివిటీ లేదా ఏడీహెచ్‌డీ అంటారు. నిలకడ లేకపోవడం, చదువు మీద ఏకాగ్రత లేకపోవడం, వస్తువులు విసిరేయడం, సహనం లేకపోవడం, ఎప్పుడూ అటూ ఇటూ తిరుగుతూ ఉండటం, స్కూల్‌లో వస్తువులు మరచిపోవడం, ఈ సమస్య ముఖ్య లక్షణాలు. వీరికి తెలివితేటలు బాగానే ఉన్నప్పటికీ, ఏకాగ్రత లోపించడం వల్ల చదువులో వెనకబడతారు. ఇలాంటి వారిని ఎంత చిన్నవయసులో గుర్తించి, సరియైన చికిత్స చేయిస్తే అంత తొందరగా దీంట్లోంచి బయట పడతారు. ఆక్యుపేషనల్ థెరపీ, బిహేవియర్ థెరపీ, అవసరమైతే కొద్ది మోతాదులో కొన్ని మందులు వాడటం ద్వారా వీరిని పూర్తిగా బాగు చెయ్యచ్చు. పేరెంట్స్, టీచర్లు ఇలాంటి వారిని త్వరగా గుర్తించగలిగితే తొందరగా బాగుపడతారు. మైకేల్ ఫిలిప్స్ అనే స్విమ్మర్ ఈ సమస్యతో బాధపడుతూ చికిత్స తీసుకుని బాగుపడి, ఒలింపిక్స్‌లో 20కి పైగా స్వర్ణ పతకాలు సాధించాడు. చైల్డ్ సైకియాట్రిస్ట్‌ల సూచనలు తీసుకోవడం, పాటించడం మేలు చేస్తుంది.



- డా. ఇండ్ల విశాల్ రెడ్డి
సీనియర్ సైకియాట్రిస్ట్, విజయవాడ.
మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ: sakshifamily3@gmail.com

---

హెల్దీ డైట్
సగ్గుబియ్యం పొంగనాలు



కావలసినవి: సగ్గుబియ్యం – అర కప్పు (గంట సేపు నానబెట్టాలి); పనీర్ తురుము – 75 గ్రాములు; వేరుశనగపప్పుల పొడి– 3 టేబుల్ స్పూన్‌లు; క్యారట్ తురుము – 3 టేబుల్ స్పూన్‌లు ; బంగాళదుంప – 1 (ఉడికించి తొక్క తీసి చిదమాలి); జీలకర్ర పొడి– టీ స్పూన్; ధనియాల పొడి– టీ స్పూన్; మిరప్పొడి– టీ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; క్యాబేజ్ తరుగు – ముప్పావు కప్పు; క్యాప్సికమ్ ముక్కలు – అర కప్పు (రెడ్, గ్రీన్ క్యాప్సికమ్); చీజ్ తురుము – 50 గ్రాములు (12 భాగాలు చేసుకోవాలి); నూనె – టీ స్పూన్.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

తయారీ: ● ఒక పాత్రలో క్యాబేజ్ తురుము, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఐదు నిమిషాల సేపు పక్కన ఉంచాలి. ఆ తర్వాత ఇందులో నూనె, చీజ్ మినహా మిగిలినవన్నీ వేసి బాగా కలిపి పన్నెండు భాగాలుగా చేయాలి. ఒక్కో భాగంలో చీజ్ స్టఫ్ చేస్తూ గోళీలాగా చేయాలి ● గుంత పొంగనాల పెనం వేడి చేసి ఒక్కో గుంతలో ఒక్కో చుక్క నూనె రుద్ది పొంగనాన్ని పెట్టి మీడియం మంట మీద కాలనివ్వాలి. ఒకవైపు కాలిన తర్వాత రెండోవైపు కాల్చాలి.

పోషకాలు: (ఒక్కో పొంగనంలో)...
● కేలరీలు 63; ● ప్రొటీన్ – 2.5 – 3 గ్రాములు; ● కార్బోహైడ్రేట్లు – 8–9 గ్రాములు; ● ఫ్యాట్ – 2–3 గ్రాములు; ● ఫైబర్– గ్రాము; క్యాల్షియం – 40 –50 గ్రాములు.

పోస్టల్ స్టాంపులు
యుద్ధం ముద్రలు

మహిళలు ఇల్లు విడిచి బయట అడుగు పెడితే వింతగా చూసే కాలంలో సాహసమే వెన్నెముకగా స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు ఎంతోమంది మహిళలు. వారి త్యాగాల వెలుగు చరిత్రకే పరిమితమైనది కాదు, వర్తమానంలోనూ స్ఫూర్తిని ఇస్తుంటుంది. ఎంతోమంది మహిళా స్వాతంత్ర్య సమరయోధుల పోస్టల్ స్టాంప్స్ విడుదల అయ్యాయి. ఈ చిన్న స్టాంప్‌లు వారి త్యాగాలు, పోరాట పటిమను ప్రతిఫలిస్తాయి. పోస్టల్ స్టాంప్స్‌పై మెరిసిన కొందరు మహిళా స్వాతంత్ర్య సమరయోధుల గురించి...

రుక్మిణీ లక్ష్మీపతి



ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని మధురైలో పుట్టింది రుక్మిణీ. గాంధీజీ 'హరిజన సంక్షేమ నిధి' కోసం తన బంగారు నగలన్నీ విరాళంగా ఇచ్చేసింది. సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్తు బహిష్కరణోద్యమంలో చురుగ్గా పాల్గొంది. ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా అరెస్టయి జైలు శిక్ష అనుభవించిన తొలి మహిళగా చరిత్రలో నిలిచింది.

సుభద్రా జోషి



గాంధీజీ ఉపన్యాసాలతో ప్రభావితం అయిన సుభద్రా జోషి విద్యార్థిగా ఉన్న రోజుల్లోనే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొంది. 'హమారా సంగ్రామ్' పత్రికకు ఎడిటర్‌గా పని చేసింది. సుభద్రను అరెస్ట్ చేసి లాహోర్ సెంట్రల్ జైల్‌కు తరలించారు. విడుదలయ్యాక మళ్లీ ఉద్యమంలో భాగం అయింది. సుభద్ర అంకితభావాన్ని నెహ్రూ ప్రశంసించారు.

రాణి మా గైడిన్లియు



బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మొదలైన 'హెరాక' ఉద్యమంలో పదమూడు సంవత్సరాల వయసులోనే పాల్గొంది రాణి మా. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన ఆదివాసి మహిళగా చరిత్రకెక్కింది. 'హెరాక' ఉద్యమంతో పాటు ఎదుగుతూ వచ్చిన రాణీ మా ప్రముఖ రాజకీయ నాయకురాలిగా, ఆధ్యాత్మిక గురువుగా ప్రఖ్యాతి పొందింది.

బేగం హజ్రత్ మహల్



తొలి తరం మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలు బేగం హజ్రత్ మహల్. బేగం హజ్రత్ ఇతర సంస్థానాధీశులతో కలిసి బ్రిటిష్ వారితో యుద్ధం చేసింది. లక్నో సమీపంలో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ వారిని ఓడించింది. ఆ తరువాత కాలంలో మాత్రం ఓటమికి గురైంది. బ్రిటిష్ వారికి చిక్కకుండా అడవుల్లో తలదాచుకొని పోరాడేది.

కమలానెహ్రూ



జవహర్‌లాల్ నెహ్రూ సతీమణి కమలా నెహ్రూ మహిళా సాధికారత కోసం గళం విప్పిన యోధురాలు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా అరెస్టై జైలుకు వెళ్లింది. 'దేశ సేవిక' సంఘాలను ఏర్పాటు చేసి ఎంతోమంది మహిళలు స్వాతంత్ర్య ఉద్యమంలో భాగం అయ్యేలా చేసింది.

సుభద్రాకుమారి చౌహాన్



సుభద్రాకుమారి చౌహాన్ కవయిత్రి, స్వాతంత్ర్య సమరయోధురాలు. సహాయ నిరాకరణ ఉద్యమంలో చేరిన తరువాత నాగపూర్ నుంచి అరెస్ట్ అయిన మొట్టమొదటి మహిళా సత్యాగ్రహిగా చరిత్రలో నిలిచింది. మహిళలపై వివక్షతకు వ్యతిరేకంగా పోరాడింది. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా ఎన్నో త్యాగాలు చేసింది.

అరుణా అసఫ్ అలి



భర్త అసఫ్ అలీతో పాటు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది అరుణ. ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొని అరెస్ట్ అయింది. కాంగ్రెస్‌పార్టీ క్విట్ ఇండియా తీర్మానం చేసిన తరువాత బ్రిటిష్ వారు విరుచుకుపడ్డారు. ప్రముఖ నాయకులను అరెస్ట్ చేశారు. ఆ క్లిష్ట సమయంలో అరుణా అసఫ్ అలి కార్యకర్తలకు అండగా ఉంది. బొంబాయి గొవాలియా ట్యాంక్ మైదానంలో కాంగ్రెస్ జెండాను ఎగరేసి క్విట్ ఇండియా ఉద్యమం ఊపందుకునేలా చేసింది.

దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాబాయి దేశ్‌ముఖ్ సాహసవంతురాలైన సామాజిక కార్యకర్త. చిన్నతనం నుంచే మహిళల హక్కుల కోసం పోరాడింది. మహాత్మా గాంధీ నుంచి స్ఫూర్తి పొంది స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. గాంధీజీ ప్రభావంతో దుర్గాబాయి మాత్రమే కాదు ఆమె కుటుంబం మొత్తం అన్ని రకాల పాశ్చాత్య దుస్తులను విడిచిపెట్టి, ఖాదీని మాత్రమే ధరించేవారు. మద్రాస్‌లో ఉప్పు సత్యాగ్రహ ఉద్యమానికి నాయకత్వం వహించింది.

రాజ్‌కుమారీ అమృత్ కౌర్



రాజ్‌కుమారీ అమృత్ కౌర్ సామాజిక కార్యకర్త, స్వాతంత్ర్య సమరయోధురాలు. గాంధీజీ కార్యదర్శిగా పని చేసిన ఆమె దండి మార్చ్‌లాంటి ఎన్నో జాతీయ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంది. క్విట్ ఇండియా ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన రాజ్‌కుమారి ఇరవై నెలల పాటు జైల్లో గడపాల్సి వచ్చింది. రాచరిక కుటుంబంలో పుట్టినప్పటికీ మహాత్ముడి ఆశ్రమంలో సాధారణ జీవితాన్ని గడిపింది.

అరుదైన ఆహ్వానం
12 ఏళ్లు... 15 లైబ్రరీలు

ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆహ్వానం అందుకున్న ఇరవై మందిలో విద్యార్థులు ఆరుగురు. వారిలో అమ్మాయి ఒకే ఒక్కరు. ఆ సరస్వతి పుత్రిక పేరు ఆకర్షణ. లైబ్రరీలు స్థాపిస్తూ సాహిత్యాన్ని సామాన్యులకు దగ్గర చేస్తున్న ఆమె అక్షరసేవకు జాతీయ స్థాయిలో అందిన గుర్తింపు ఇది.


సికింద్రాబాద్ రాష్ట్రపతి నిలయంలో రాష్ట్రపతితో...

''హైదరాబాద్ హెడ్ పోస్ట్ ఆఫీస్ పోస్ట్‌మాస్టర్ నుంచి 12వ తేదీన నాన్నకు ఫోన్ వచ్చింది. స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా 15వ తేదీన ఢిల్లీలో జరిగే వేడుకలకు హాజరు కావలసిందిగా మీ అమ్మాయి ఆకర్షణకు ఆహ్వానం వచ్చిందని చెబుతూ అభినందనలు తెలియచేశారు'' అంటూ తాను లైబ్రరీ వ్యవస్థాపకురాలిగా మారిన వివరాలను సాక్షి ఫ్యామిలీతో పంచుకున్నారు ఆకర్షణ సతీష్.

కోవిడ్ వచ్చినప్పుడు

''హైదరాబాద్‌లో స్థిరపడిన తమిళ కుటుంబం మాది. నాన్న సతీశ్ క్యాన్సర్ ఎక్విప్‌మెంట్ తయారీ కంపెనీ ఉద్యోగి. నేను హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్నాను. పుస్తక పఠనం నా హాబీ కావడంతో వెయ్యికి పైగా పుస్తకాలతో ఇంట్లోనే నాకు సొంత లైబ్రరీ ఉంది. ఇతరుల కోసం లైబ్రరీ స్థాపించాలనే ఆలోచన కోవిడ్ సమయంలో వచ్చింది.

తొలి లైబ్రరీ క్యాన్సర్ హాస్పిటల్‌లో

నాన్న ఉద్యోగరీత్యా క్యాన్సర్ హాస్పిటళ్లకు టచ్‌లో ఉంటారు. కోవిడ్ సమయంలో ఎమ్ఎన్‌జే క్యాన్సర్ హాస్పిటల్ వాళ్లు 'కోవిడ్ కారణంగా వంటవాళ్లు డ్యూటీకి రావడం లేదు. పేషెంట్‌లకు ఆహారం అందించడానికి ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేసి పెట్టవలసింది'గా కోరడంతో నాన్న వాళ్ల కోసం రోజూ భోజనం వండించి తీసుకెళ్లి ఇచ్చేవారు. నాకు స్కూల్ లేకపోవడంతో రోజూ నాన్నతోపాటు హాస్పిటల్‌కి వెళ్లేదాన్ని. అక్కడ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న పేషెంట్‌లలో నా ఏజ్ గ్రూప్ వాళ్లతో స్నేహం ఏర్పడింది. వాళ్లు కొంతమంది చదువుకోవడానికి పుస్తకాలు తెచ్చిపెట్టమని అడిగారు. రోజూ నా పుస్తకాలు కొన్ని తీసుకెళ్లి ఇస్తూ ఉన్నప్పుడు హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ జయలత గారు... 'హాస్పిటల్‌కి చికిత్స కోసం ఎప్పుడూ కొత్తవాళ్లు వస్తుంటారు. హాస్పిటల్‌లోనే లైబ్రరీ ఉంటే బావుంటుంది' అన్నారు. వారి ఆలోచనే నా లైబ్రరీ ఉద్యమానికి నాంది. నా పుస్తకాలతోపాటు మా స్కూల్, అపార్ట్‌మెంట్ స్నేహితుల నుంచి సేకరించిన వెయ్యికి పైగా పుస్తకాలతో తొలి లైబ్రరీ అలా మొదలైంది. ఇప్పటికి 9,836 పుస్తకాలతో 15 లైబ్రరీలు ఏర్పాటు చేయగలిగాను.

పదకొండు వేల పుస్తకాలు

నాలుగేళ్లలో పదకొండు వేల పుస్తకాలు సేకరించాను. అందులో రెండు వేల పుస్తకాలు ప్రధాని నరేంద్రమోదీగారిచ్చారు. ఈ ఏడాది మార్చి 18న కోయంబత్తూరులో ఆయనను కలిసే అవకాశం వచ్చింది. ఆ సందర్భంగా ఆయన 25 లైబ్రరీలు స్థాపించమని, 25 లైబ్రరీ స్థాపనకు స్వయంగా హాజరవుతానని చెప్పారు. భారత రాష్ట్రపతి గత ఏడాది శీతాకాల విడిది కోసం హైదరాబాద్‌కి వచ్చినప్పుడు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో కలిశాను. అప్పుడామె 'ప్రజల్లో రీడింగ్ హ్యాబిట్ తగ్గుతోంది, పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడానికి దోహదం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని కొనసాగించ'మని చెప్పి ఆమే స్వయంగా 74 పుస్తకాలిచ్చారు. ఈ ఏడాది ఢిల్లీ, కర్తవ్య పథ్‌లో జరిగిన 75వ రిపబ్లిక్ డే ఉత్సవాలకు ప్రభుత్వ ప్రత్యేక ఆహ్వానం మేరకు హాజరయ్యాను. ఇదే ఏడాది స్వాతంత్ర్యదినోత్సవం వేడుకలకు కూడా హాజరయ్యే అవకాశం కలగడం సంతోషంగా ఉంది'' అంటూ 25 లైబ్రరీల లక్ష్యాన్ని పూర్తి చేస్తానని చెప్పింది ఆకర్షణ సతీశ్.

- వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి